http/www.manatholipoddu.com

మన తొలిపొద్దు

E-Paper

డిజిటల్ డైలీ

సంపుటి : 02 సంచిక : 285 | మంగళవారం అక్టోబర్ 27, 2026 | పేజీలు :04 | వెల: రూ. 5/-

## తమ్మిడిహట్టిపై కాంగ్రెస్ కాలయాపన: హరీశ్‌రావు

### - కాళేశ్వరం మరమ్మతులు చేపట్టాలని సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 26 తొలిపొద్దు,**

తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నాయకుడు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించడానికి తమ ప్రభుత్వానికి 42 రోజులు పట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి 1,054 రోజులు గడిచినా ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే ఇప్పటివరకు జరిగిన చర్చలు, ప్రాజెక్టు ప్రణాళిక, నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రకటనలు చేయడం కాకుండా, దాని సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.తమ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు 2014 జూలై 23న మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. మొదటి ఆరు నెలల్లోనే ఆరుసార్లకు పైగా చర్చలు జరిపామని తెలిపారు

## సీతాలక్ష్మి రామస్వామి కళాశాల

# వజ్రోత్సవ వేడుకలు

### - తిరుచిరాపల్లిలో జరిగిన వేడుకల్లో నిర్మలా సీతారామన్
### - వజ్రోత్సవ ప్రదర్శనను ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి
### - కళాశాల వ్యవస్థాపకులకు పుష్పాంజలి
### - వజ్రోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

**తిరుచిరాపల్లి, అక్టోబర్ 26తొలిపొద్దు,**

తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఉన్న సీతాలక్ష్మి రామస్వామి కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా పలు కార్యక్రమాలు జరిగాయి. విద్యా రంగంలో కళాశాల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ వజ్రోత్సవాలను నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ పాల్గొని వేడుకలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభించారు.

## సంగారెడ్డి టీఎన్జీవో నూతన కార్యవర్గానికి మంత్రి అభినందనలు

- మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన ఉద్యోగ సంఘం ప్రతినిధులు
- అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ నేతృత్వంలో మర్యాదపూర్వక భేటీ
- ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం
- ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగులదే కీలక పాత్ర

**సంగారెడ్డి, అక్టోబర్ 26 తొలిపొద్దు,**

సంగారెడ్డి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షులు పి. వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కోశాధికారి కసిని శ్రీకాంత్, మహిళా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మిని మంత్రి దామోదర్ రాజనర్సింహకు పరిచయం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మంత్రి అభినందించారు.





## తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కీలక చర్చలు

### - 152 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన
### - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్ భేటీ
### - ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం
### - అధ్యయనానికి అధికారుల కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన

**హైదరాబాద్, అక్టోబర్ 26తొలిపొద్దు,**

తెలంగాణ సాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక చర్చలు జరిగాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, దాని ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఇరు రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై బీజేపీ దృష్టి

- యువమోర్చా కార్యకర్తలకు రామ్‌చందర్‌రావు పిలుపు
- అర్హులైన పట్టభద్రులందరూ నమోదు చేసుకోవాలి
- ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలి
- యువత సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్ 26 తొలిపొద్దు,**

రాబోయే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని యువమోర్చా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రతి కార్యకర్త చొరవ తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన పట్టభద్రులు భాగస్వాములయ్యేందుకు అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని రామ్‌చందర్‌రావు యువమోర్చా కార్యకర్తలకు సూచించారు. తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరుగా నమోదు చేసుకునే విధానం గురించి వివరించాలని కోరారు. నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేస్తూ, అవసరమైన పత్రాల సమర్పణలో వారికి సహకరించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై సమాచారం అందేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో యువత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉందని రామ్‌చందర్‌రావు వ్యాఖ్యానించారు. యువత ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



## పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల

# తుది బిల్లుల చెల్లింపు

### - లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ
### - నేలకొండపల్లిలో రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ
### - అనాసాగరం--పమ్మి రహదారికి రూ.2.80 కోట్లతో శంకుస్థాపన
### - రెండో పంట వేయవద్దని రైతులకు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

**నేలకొండపల్లి, అక్టోబర్ 26 తొలిపొద్దు,**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న తుది బిల్లులన్నింటినీ రాబోయే పది రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎలాంటి లంచాలకు తావు లేకుండా బిల్లుల చెల్లింపులు చేపడతామని స్పష్టం చేశారు. నేలకొండపల్లి రైతు వేదికలో నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండలంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్లు అందించడంతో పాటు, ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.



# శంభు దేవాలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారు

## - శృంగేరి జగద్గురువులు నిర్ణయించిన ముహూర్తంలో శ్రీకారం.. ఏర్పాట్లు పూర్తి

**తొలిపొద్దు, నంగునూరు :**

జిల్లాలోని నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో కొలువైన వెయ్యేళ్ల నాటి శ్రీ శంభు దేవాలయ పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. శృంగేరి జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామివారు నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం నవంబర్ 20న ఉదయం 9.30 గంటలకు పునర్నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు దేవాలయ చైర్మన్ జనమంచి సీతారామ శర్మ ద్వివేది తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జనమంచి సీతారామ శర్మ ద్వివేది మాట్లాడుతూ.. శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి ఆశీస్సులతో, శ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామివారి సమక్షంలో కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరి పీఠంలో లక్ష్మీ గణపతి పురశ్చరణ యాగాన్ని నిర్వహించినట్లు వివరించారు. దేవాలయ పునర్నిర్మాణం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పునర్నిర్మాణానికి సంబంధించిన శిలాన్యాసం కోసం జగద్గురువులు స్వయంగా శిలలను పూజించి అందజేయడంతోపాటు తమ ఆశీస్సులు అందించినట్లు తెలిపారు. జగద్గురువుల ఆశీస్సులతో ప్రారంభం కానున్న ఈ పునర్నిర్మాణ కార్యక్రమం పాలమాకుల గ్రామానికే కాకుండా పరిసర ప్రాంతాల భక్తులకు కూడా ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు.వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ శంభు దేవాలయం పునర్నిర్మాణంతో ప్రాచీన ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. మన ప్రాంతంలోనే ఇంతటి ప్రాచీన దేవాలయం ఉండటం గర్వకారణమని, దాని పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.దేవాలయ నిర్మాణం కేవలం ఒక కట్టడం నిర్మించడమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించే పవిత్ర కార్యక్రమమని వివరించారు. భక్తులు, దాతలు, గ్రామ ప్రజలు తమకు తోచిన విధంగా సహకరించి పునర్నిర్మాణ పనులను విజయవంతం



చేయాలని విజ్ఞప్తి చేశారు.భక్తులు, దాతలు భాగస్వాములు కావాలిశ్రీ శంభు దేవాలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు, ఆధ్యాత్మికవేత్తలు, గ్రామ ప్రజలు ముందుకు రావాలని జనమంచి సీతారామ శర్మ ద్వివేది పిలుపునిచ్చారు. అందరి సహకారంతో దేవాలయాన్ని పునర్వైభవం దిశగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర కార్యంలో భాగస్వాములై శ్రీ శంభు దేవుడి కృపతోపాటు శృంగేరి జగద్గురువుల ఆశీస్సులు పొందాలని కోరారు. నవంబర్ 20న ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్న పునర్నిర్మాణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సాగు భూముల సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం..

**తొలిపొద్దు, కొమురవెల్లి:**

సాగు భూముల సంరక్షణతో పాటు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొమురవెల్లి గ్రామంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరిరక్షణ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, పంటల మార్పిడి విధానాలపై రైతులకు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ), వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), గ్రామ రైతులు పాల్గొన్నారు.




# కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న యాదాద్రి ధర్మకర్తల మండలి సభ్యురాలు

**తొలిపొద్దు, కొమురవెల్లి:**

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం పర్యవేక్షకుడు చంద్రశేఖర్ స్వామివారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ యాదవ్ మాట్లాడుతూ, మల్లన్న స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.




# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**తొలిపొద్దు, మిరుదొడ్డి:**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు పూదూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, కవులు, కళాకారులు, మహిళలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొని, జైలు శిక్షలు అనుభవించి, విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన వారు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పింఛన్, హైదరాబాద్‌లో 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణ సాయం, కుటుంబానికి ఉచిత బస్సు సౌకర్యం, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. గ్రామీణ స్థాయిలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన వారిని గుర్తించి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి వారి వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. ఉద్యమకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీల నాయకులపై ఉందన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధనకు ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**తొలిపొద్దు, సిద్దిపేట:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 103 దరఖాస్తులను స్వీకరించారు.పెండింగ్ ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించి, అర్జీదారులకు సమాధానం ఇవ్వాలని సూచించారు. వచ్చే వేసవిలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు నవంబర్ మొదటి, రెండో వారాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ లీకేజీల నివారణ, నీటి వృథా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ఎస్‌డీసీలు సుదర్శన్‌రెడ్డి, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జిల్లా అధికారులు



# దాతలకు సన్మానం.. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ!

## - అమ్మవారి శరన్నవరాత్రులకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు

**తొలిపొద్దు, అక్బర్‌పేట-భూంపల్లి:**

ఆదర్శ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వేడుకలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం దాతలకు అమ్మవారి చీరలు, ప్రసాదాన్ని సర్పంచ్ మడ్డి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ మడ్డి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా స్కూల్ యూనిఫాంలు, బెల్టులు, బూట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రశాంత్, మాయాస మురళి, చల్మెడ నరసింహులు, సిద్ధమైన స్వామి, వడ్ల శ్రీనివాస్, నీల వేణు, నీల కృష్ణ, మైలా అశోక్, కుంటకొమ్ము రాజు, నీళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రిలో నర్రా రాజిరెడ్డికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ

**తొలిపొద్దు, మిరుదొడ్డి:**

వైరల్ ఫీవర్‌తో కొంపల్లిలోని మెడ్‌వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిరుదొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్రా రాజిరెడ్డిని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆందోళన చెందవద్దని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు రజనకు ప్రవీణ్ కుమార్, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టిగా సిద్ధం కావాలి

## - ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం..

## మంత్రి పొన్నం ప్రభాకర్

**తొలిపొద్దు, సిద్దిపేట బ్యూరో / హుస్నాబాద్:**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అనంతరం ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి అవసరమైన సహకారం కోరుతామని తెలిపారు. సోమవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 136 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులు మద్దతు ధర కంటే తక్కువకు పంటలను విక్రయించవద్దని, దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వేసవిలో నీటి ఎద్దడి నివారణకు నీటిని పొదుపుగా వినియోగించాలని, చెరువుల పూడికతీత, బోర్‌వెల్ రీచార్జ్ వంటి పనులు చేపట్టాలని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపైనా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

